
సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024




కొలిక్కిరాని పరిహారం!

అధికారుల సమన్వయ లోపంతో నాగర్‌గూడ-శంషాబాద్ మధ్య నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. 8లో▸



రెక్కీ చేసి.. ఇల్లు లూటీ

దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికి రెండుసార్లు రెక్కీ నిర్వహించి భారీ ఎత్తున నగలు, నగదు దోచుకెళ్లారు. 8లో▸



న్యూస్‌రీల్

పంచాయతీ రికార్డుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌మోహన్

యాచారం: మండల పరిధిలోని గునుగల్ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూలు, నిధుల ఖర్చు, వెంచర్ల వివరాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరవుతున్న నిధులపై ఆరా తీశారు. పంచాయతీల్లో ప్రతి పైసాకు సంబంధించి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రికార్డుల నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఎల్‌పీఓ సాధన, మండల పంచాయతీ అధికారి ఉమారాణి ఉన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఆగాపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత తదితరులు

మంచాల: మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. మండలంలోని ఆగాపల్లి నర్సరీని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాలు కురిసే నాటికి సరిపడా మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలు చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే నీళ్లు పట్టాలని తెలిపారు. చిన్న, పెద్ద మొక్కలను వేరు చేయాలని, వాటి మధ్య కలుపు రాకుండా చూడాలని సూచించారు. గ్రేడింగ్ పద్ధతిలో పెంచితే ఎన్ని అవసరమనే విషయం కూడా స్పష్టమవుతుందన్నారు. మొలవని మొక్కల స్థానంలో చింత, వేప, కానుగ, టెకోమ, బొప్పాయి, మునగ విత్తనాలు నాటాలన్నారు. ప్రతి గ్రామంలో లక్ష్యానికి అనుగుణంగా 120 మంది కూలీలకు తప్పక పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియ నాయక్, ఏపీఓ వీరాంజనేయులు, టీఏ స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం



టై సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరణ

గచ్చిబౌలి: మహిళా పారిశ్రామికవేత్తలకు అవకాశాలను సృష్టించేందుకు అంకితమైన ప్రపంచ వేదిక 'టై ఉమెన్–2024' 5వ ఎడిషన్‌ను ప్రారంభించినట్లు టై (టీఐఈ–ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) హైదరాబాద్ ప్రతినిధులు ప్రకటించారు. గచ్చిబౌలిలో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ టై ఉమెన్–2024 కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత సాధించడానికి స్టార్టప్‌లు తప్పనిసరిగా యాక్టివ్ ఉమెన్ ఫౌండర్ లేదా సహ వ్యవస్థాపకులు కనీసం 33 శాతం కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం, దరఖాస్తు కోసం టై మహిళల వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలకు విలువైన వనరులు, మార్గదర్శకత్వం, పెట్టుబడి అవకాశాలను అందించడం ద్వారా వారికి ప్రభావవంతమైన ఫలితాలను సృష్టించేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు.

'లైన్'లో పడేనా!

యాచారం మండలం మీదుగా ప్రాథమిక సర్వే

- రెండు మార్గాల్లో రైల్వే లైన్లకు మార్కింగ్
- సర్వే ముమ్మరం చేసిన ఇంజినీరింగ్ సిబ్బంది
- స్థానికుల్లో చిగురిస్తున్న ఆశలు
- మరోవైపు భూములు పోతాయని రైతుల ఆందోళన



తక్కళ్లపల్లి గేట్ సమీపంలో ఇంజినీరింగ్ సిబ్బంది వేసిన మార్కింగ్



కొత్తపల్లి-తక్కళ్లపల్లి గ్రామాల సమీపంలో మార్కింగ్ వేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

యాచారం: రైలు కూత వినాలన్న యాచారం మండల వాసుల కల ఇప్పటికైనా నెరవేరనుందా.. మండలం మీదుగా రెండు రైల్వే లైన్ల ఏర్పాటుకు ప్రాథమిక సర్వే ముమ్మరంగా సాగుతుండడంతో స్థానికుల ఆశలు చిగురిస్తున్నాయి. రైల్వే శాఖ ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది ద్వారా మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల, తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల మీదుగా రైలు మార్గం కోసం ప్రాథమిక సర్వే చేయిస్తోంది. ప్రైవేట్ కన్సల్టెన్సీ ఇంజినీరింగ్ సిబ్బంది రెండు వేర్వేరు మార్గాల్లో మార్కింగ్ ఇస్తున్నారు.

రెండు కిలోమీటర్ల దూరంలో మార్కింగ్..

ఇంజినీరింగ్ సిబ్బంది ప్రాథమిక సర్వే చేస్తూ రెండు కిలోమీటర్ల దూరంలో ఒక మార్కింగ్ వేస్తున్నారు. ఒక రైల్వే లైను ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నుంచి తెలంగాణలోని కోదాడ, నల్లగొండ, మునుగోడు నియోజకవర్గాల మీదుగా యాచారం మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి శంషాబాద్ రైల్వే స్టేషన్ వరకు.. తెలంగాణలోని డోర్నకల్ నుంచి కూసుమంచి, పాలేరు, మోతె, సూర్యాపేట, భీమారం, నల్లగొండ, యాచారం మండలం మీదుగా కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, భూత్పూర్ ప్రాంతాల మీదుగా గద్వాల వరకు మరో రైల్వే లైను ఏర్పాటుకు ప్రాథమిక సర్వే కొనసాగుతోంది. గుట్టలు, రాళ్లు, రప్పలు, చెరువులు, కుంటలు తేడా లేకుండా సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే సిబ్బంది రెండు మార్గాల్లో సర్వే చేస్తుండడంతో స్థానికులు ఒక లైనా.. రెండు లైన్లా అంటూ ఇంజినీరింగ్ సిబ్బందిని ఆరా తీస్తున్నారు. అయితే రైల్వే లైన్లు వేస్తారా.. వెయ్యరా.. అనే విషయం తమకు తెలియదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రెండు మార్గాల్లో ప్రాథమిక సర్వే చేపడుతున్నట్లు వారు తెలియజేస్తున్నారు. కాగా సాగర్‌రోడ్డుకు సమీపంలోని మాల్–నల్లవెల్లి గ్రామాల సమీపంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు కాబోతోందనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

సర్వే రూపుదాలిస్తే..

రైల్వే లైన్ల కోసం ఇంజినీరింగ్ సిబ్బంది చేస్తున్న ప్రాథమిక సర్వే నిజమైతే మరి కొన్నేళ్లలోనే స్థానిక ప్రజలకు రైలు కూత వినపడనుంది. ఈ ప్రాంతం నుంచి రైల్వే మార్గం డిమాండ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి ఉంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇబ్రహీంపట్నం, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల మీదుగా మాచర్ల, గుంటూరు, విజయవాడ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ఆయా ప్రాంతాలకు తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. నాగార్జునసాగర్ ప్రముఖ పర్యాటక కేంద్రం కావడంతో రైల్వే లైన్‌తో మరింత మంది విదేశీ పర్యాటకులు సందర్శనకు వచ్చే అవకాశం ఉంది. కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు కోసం ప్రాథమిక సర్వే, మార్కింగ్‌తో ఒకవైపు స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతుండగా, రైతుల్లో మాత్రం ఆందోళన నెలకొంది. రైల్వే లైన్ కోసం వ్యవసాయ భూములు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

మంచిదే కానీ..



రైల్వే లైన్ల ప్రాథమిక సర్వేలో భాగంగా సాగర్ రోడ్డుకు సమీపంలో ఉన్న మాల్–నల్లవెల్లి గ్రామాల సమీపంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు కాబోతోందని అంటున్నారు. రైలు మార్గం వస్తే మంచిదే కానీ భూములు పోతాయన్న భయం ఉంది.

– జిల్లా రాములు, రైతు, నల్లవెల్లి

మాకైతే సమాచారం లేదు



యాచారం మండల పరిధిలోని పలు గ్రామాల మీదుగా రైల్వే లైను ఏర్పాటు కాబోతుందనే విషయమై మాకైతే సమాచారం లేదు. రైల్వే లైను ఏర్పాటైతే కావాల్సిన భూసేకరణపై ప్రభుత్వం నుంచి సమాచారం వస్తుంది. కానీ అటువంటిదేమీ లేదు.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

కేసీఆర్ పాలన స్వర్ణయుగం

- చేవెళ్ల నుంచి కాసానిని గెలిపించుకుందాం
- మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ పాలన స్వర్ణయుగంలా కొనసాగిందని.. ప్రతి ఒక్కరి గుండెల్లో కేసీఆర్ ఉన్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సోమవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన చేవెళ్ల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, దయానంద్‌గుప్తా, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేసింది కేసీఆర్ అన్నారు. చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిగా జిల్లాకు సుపరిచితుడు, ఎంతో రాజకీయ అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపిక చేశారని చెప్పారు. గతంలో రెండు సార్లు చేవెళ్ల ఎంపీ అభ్యర్థులుగా పంపించిన ఇద్దరిని ఈ గడ్డపై గెలిపించామని.. ఇప్పుడు కూడా ప్రతి కార్యకర్త కాసాని గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషితోనే విజయం సాధ్యమని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏం అమలు చేసిందో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని.. చేసిందేమిటో చెప్పాలన్నారు. చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా పంపిద్దామన్నారు.

ఆశీర్వదించి గెలిపించండి

తనను ఆశీర్వదించి చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కోరారు. కేసీఆర్, కేటీఆర్, సబితారెడ్డి అండతో చేవెళ్ల అభివృద్ధికి పాటుపడుతానని చెప్పారు. ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించి అందుబాటులో ఉంటానని తెలిపారు. అందరం కలిసి చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేద్దామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎం.ఆనంద్, డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

నీటి ఎద్దడి రానీయెుద్దు

- అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్


యాచారం: ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని గాండ్లగూడెం, గునుగల్ గ్రామాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా.. సరఫరాలో ఇబ్బందులున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి నీటి సరఫరాలో ఇబ్బందులపై ఆరా తీశారు. వచ్చే రెండు నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని, మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ముందు జాగ్రత్త చర్యగా గ్రామాల్లో ఉన్న బోరుబావులకు తక్షణమే మరమ్మతులు చేయించి ప్రజలకు నీటి సరఫరా చేసేలా చూడాలన్నారు. అత్యవసరమైతే గ్రామాల సమీపంలో ఉన్న వ్యవసాయ బోరు మోటార్లను లీజ్‌కు తీసుకుని సరఫరా చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటి సరఫరా చేసే సమయం, పొదుపుగా వాడుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఎల్‌పీఓ సాధన, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి తదితరులు ఉన్నారు.

ఎన్నికల శిక్షణ కేంద్రం సందర్శన

ఇబ్రహీంపట్నం: లోక్ ఎన్నికల నేపథ్యంలో శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో భువనగిరి పరిధిలోకి వచ్చే ఎన్నికల సిబ్బందికి అధికారులు శిక్షణ ఇస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పనిచేసే సుమారు 688 మంది ఎన్నికల సిబ్బందికి ఇస్తున్న శిక్షణ శిబిరాన్ని సోమవారం అడినషల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై వారితో మాట్లాడి సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి ఉన్నారు.

'రియల్' ఆదాయం అంతంతే..

- గ్రేటర్‌లో లావాదేవీలపై ఎన్నికల ప్రభావం
- రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా రాబడి
- కొత్త ఆర్థిక సంవత్సరంపై ఆశలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో 2023– 24 ఆర్థిక సంవత్సరం స్థిరాస్తి రంగానికి పెద్దగా ఊతం ఇవ్వలేదు. దస్తావేజుల లావాదేవీలు అంతంత మాత్రంగానే జరగడంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు కూడా రాబడి ఆశించిన స్థాయిలో పెరగలేదు. రంగారెడ్డి జిల్లాలో మాత్రం రూ.4,482.64 కోట్ల రాబడి వచ్చింది. గతేడాదితో పోల్చితే రూ.611.26 కోట్లు పెరిగినట్లు తెలుస్తోంది. మొత్తం మీద హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో స్థిరాస్తి లావాదేవీలు స్వల్పంగా పెరిగినట్లు కనిపిస్తోంది. శివారు ప్రాంతాల్లో ఫాంల్యాండ్స్ విక్రయాలు పెరగగా, ఖాళీ స్థలాలు, ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లు పెద్దగా చోటు చేసుకోలేదు.

ఎన్నికల ప్రభావం..

2023–24 ఆర్థిక సంవత్సరంలో స్థిరాస్తి రంగంపై ఎన్నికలు తీవ్ర ప్రభావం చూపాయి. అసెంబ్లీ ఎన్నికలతో పాటు త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల ప్రభాం కనిపిస్తోంది. వాస్తవంగా స్థిరాస్తి వ్యాపారుల్లో అత్యధిక శాతం రాజకీయ పక్షాల నేతలు ఉంటారు. ఎన్నికల నేపథ్యంలో భూముల క్రయవిక్రయాలపై పెద్దగా పెట్టుబడులు సమకూరలేదు. మరోవైపు ఎన్‌ఆర్‌ఐలు సైతం స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబర్చలేదు. ఎన్నికల నేపథ్యంలో స్థిరాస్తి రంగం నేల చూపులు చూసింది.

కొత్త ఆర్థిక సంవత్సరంపై ఆశలు

2024–25 ఆర్థిక సంవత్సరంలో స్థిరాస్తి రంగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత లావాదేవీలు పెరిగే అవకాశాలు ఉన్నట్లు స్థిరాస్తి వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

శివారులో ఇలా..

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్	దస్తావేజులు
రంగారెడ్డి ఆర్‌ఓ	24,367
మహేశ్వరం	21,596
ఇబ్రహీంపట్నం	17,420
ఫరూఖ్‌నగర్	17,041
గండిపేట	16941
చంపాపేట	15,298
వనస్థలిపురం	14,334
రాజేంద్రనగర్	13,179
శేరిలింగంపల్లి	13,037
ఎల్బీనగర్	12,622
పెద్ద అంబర్‌పేట	10,032

వన్‌టైం చాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ కాలేజీల్లో చదివి ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష రాసుకునేందుకు వన్‌టైం చాన్స్ ఇవ్వనున్నారు. చాలా ఏళ్ల క్రితం బీఏ, బీకాం, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సుల్లో ఫెయిలైన విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఓయూ అధికారులు తిరిగి వారు పరీక్ష రాసుకునేందుకు అవకాశం కల్పించారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- ప్రిసైడింగ్ అధికారులు జాగ్రత్తగా ఉండాలి
- విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- కలెక్టర్ శశాంక



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక


సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రిసైడింగ్ అధికారులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని, రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శశాంక సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వర్తించే రాజేంద్రనగర్ నియోజకవర్గ సిబ్బందికి సోమవారం రాజేంద్రనగర్ మండలం, శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో.. శేరిలింగంపల్లి నియోజకవర్గ సిబ్బందికి మాదాపూర్‌లోని శ్రీవేంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజీలో ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులకు (ఏపీఓ) నిర్వహిస్తున్న శిక్షణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల రోజున నిర్వర్తించే విధులపై సూచనలు, సలహాలు చేశారు. పీవో డైరీ, 17సీపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి వీవీప్యాట్లలో ఉండే స్లిప్పులను ప్రత్యేక కవర్లో ఉంచాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌లపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే సెక్టోరియల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తప్పకుండా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, రాజేంద్రనగర్ ఏఆర్‌ఓ వెంకటరెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో ఫారం–12(డి) సమర్పించాలి

పోస్టల్ బ్యాలెట్ కోసం అవకాశం ఉండి, వినియోగించుకోదల్చిన వారు ఈ నెల 20వ తేదీ లోపు నిర్ణీత ఫారం–12(డి) పూరించి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల నోడల్ అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యవసర సర్వీసులకు చెందిన వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోందని అన్నారు. ఎన్నికల కమిషన్ ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. ఈనెల 20వ తేదీ లోపు సమర్పించే ఫారం –12(డీ)లను మాత్రమే పరిగణలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కలిప్తామని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ వేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, నోడల్ అధికారి కృష్ణారెడ్డి, చేవెళ్ల ఏఆర్‌ఓ సాయిరాం, అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

రానున్న రెండు నెలల పాటు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పన, వేసవిలో ఉష్ణోగ్రతలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ శశాంక సమావేశమయ్యారు. వేసవిలో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవి సెలవుల్లో ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని డీఈఓను ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున చిన్న పిల్లలు, వృద్ధులు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు బయట తిరగొద్దని సూచించారు. ఎండ వేడిని తట్టుకునేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 7 గంటలకు వచ్చి 11 గంటల వరకు పని చేసేలా చర్యలు చేపట్టాలని పీడీ డీఆర్డీఏను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



'మండే..'

- సుర్రుమన్న సూరీడు..
- పగలు భగభగలు..రాత్రి ఉక్కపోత
- సోమవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు
- మియాపూర్‌లో 41.7 డిగ్రీలు, కందుకూరులో 41.6 డిగ్రీలు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: ఎండలు భగ్గున మండుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే సూరీడు నిప్పులు కక్కుతున్నాడు. మధ్యాహ్నం వేళ్ల బయటికి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. తాజాగా సోమవారం మియాపూర్‌లో అత్యధికంగా 41.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కందుకూరు, చందానగర్, నాగోల్‌లో 41.6 డిగ్రీలు, చిలుకూరు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 41.5 డిగ్రీలు, ఇబ్రహీంపట్నంలో 41.5, డిగ్రీలు, షాబాద్, రాచలూరు, అత్తాపూర్ తదితర మండలాల్లో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రతల చొప్పున రికార్డు అయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో 40 నుంచి 40.9 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మీటరు గిరగిర..

భగ్గున మండుతున్న ఎండలకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు రోజంతా ఆన్‌లో ఉండటం, సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగిస్తుండటంతో సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు హీటెక్కుతున్నాయి. ఫీడర్లు ట్రిప్పవుతుండటంతో పాటు కండక్టర్లు, ఇన్సులేటర్లు వేడికి పేలిపోతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం ఐదు నుంచి తొమ్మిది గంటల మధ్య అత్యధిక డిమాండ్ నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో గత ఏడాది ఏప్రిల్ 1న 2954 మెగావాట్లు నమోదు కాగా, తాజాగా సోమవారం ఏకంగా 3738 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైంది.

తమ్ముడిపై అన్న కత్తితో దాడి

హత్యాయత్నం కేసు నమోదు

మొయినాబాద్: డబ్బుల విషయంలో అన్నదమ్ములు గొడవపడి తమ్ముడిపై అన్న కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రమేశ్, రాఘవేందర్ ఇద్దరు అన్నదమ్ములు. వీరిద్దరూ తరచూ గొడవ పడేవారు. కాగా ఆదివారం రాత్రి డబ్బుల విషయంలో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన రమేశ్ కత్తితో తమ్ముడిపై దాడి చేసి కడుపులో మూడుసార్లు పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాలైన రాఘవేందర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. తన భర్తను చంపాలనే కుట్రతోనే రమేశ్ కత్తితో పొడిచాడని భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని రామంతపురం గేటు సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన సోమవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతపురం బస్‌స్టేజీ సమీపంలో స్థానికులు గుర్తు తెలియని మహిళా మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరుపుల కంపెనీలో అగ్ని ప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లోని పరుపుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీలో కొన్ని నెలలుగా పరుపులు తయారు చేస్తున్నారు. సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన యజమాని యాకుత్ అందరిని అప్రమత్తం చేయగా అప్పటికే అతడి చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే పరుపుల తయారీ సామగ్రి మొత్తం కాలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

కొలిక్కిరాని భూముల పరిహారం!

- రైతులు అడ్డుకోవడంతో నిలిచిన వంతెన పనులు
- నాగర్‌గూడ–శంషాబాద్ రోడ్డు విస్తరణకు అడ్డంకి


బ్రిడ్జి పక్క నుంచి ఏర్పాటు చేసిన మార్గం


నాగర్‌గూడ వద్ద నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

షాబాద్: రెవెన్యూ, తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీఎస్‌ఐఐసీ) అధికారుల సమన్వయ లోపంతో నాగర్‌గూడ–శంషాబాద్ మధ్యన నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. ముంబయి–బెంగళూరు జాతీయ రహదారులకు లింకు రోడ్డు అయినా కంది–షాద్‌నగర్ రహదారిపై నాగర్‌గూడ చౌరస్తా నుంచి రుద్రారం, హైతాబాద్, చందనవెల్లి మీదుగా శంషాబాద్ వరకు నాలుగు లైన్లు (100 అడుగుల వెడల్పు) విస్తరణతో పాటు వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా భూములు కోల్పోయిన తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందించకుండా వంతెన నిర్మాణం పనులు ఎలా చేపడుతారని నిర్వాసితులు పనులను అడ్డుకున్నారు. దీనిపై టీఎస్ఐఐసీ ఇంజనీర్ భరత్‌రెడ్డి రెవెన్యూ అధికారులను స్పందించగా అందరికీ పరిహారం చెల్లించామని షాబాద్ తహసీల్దార్ పేర్కొన్నారు.

అన్నదాతల మొర

గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందలేదని ఎన్నో రోజులుగా వారు నిరసన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల అలసత్వంతోనే పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని ఎన్నికలకు ముందు ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తూ హైతాబాద్ గ్రామంలో ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చందనవెల్లి, హైతాబాద్ భూముల పరిహారం విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కుమ్మక్కై కాజేశారు

అధికారం చేపట్టి తర్వాత ఉపముఖ్యమంత్రి హోదాలో భట్టి విక్రమార్క చందనవెల్లి గ్రామానికి వెళ్లిన సందర్భంలో భూములు కోల్పోయిన కొంత మంది రైతులు అప్పటి ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై తామకు రావాల్సిన పరిహారం కాజేశారని విన్నవించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పూర్తిస్థాయి పరిహారం అందిస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. కానీ భూముల పరిహారానికి సంబంధించి సమస్యలు లేవని తహసీల్దార్ చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా రైతులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించి రహదారి విస్తరణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎకరాకు డబ్బులు రాలేదు



గత ప్రభుత్వం రోడ్డు విస్తరణ పేరుతో నాకు ఉన్న మూడు ఎకరాల భూమిని తీసుకుంది. రెండు ఎకరాలకు మాత్రమే డబ్బులు ఇచ్చారు. మిగతా ఒక ఎకరా భూమికి డబ్బులు ఇవ్వకుండా అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు కాజేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే న్యాయం చేయాలి.


– బేగరి యాదయ్య, రైతు, చందనవెల్లి

న్యాయ్యం చేయాలి



గత ప్రభుత్వంలో పేదల నుంచి తీసుకున్న భూములకు నష్టపరిహారంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి. నాకు రెండున్నర ఎకరాల భూమి ఉంటే రెండు ఎకరాలకు మాత్రమే పరిహారం ఇచ్చారు. మిగతా అర ఎకరాకు ఇవ్వలేదు.

– శోభ, రైతు, చందనవెల్లి



సొంత ఊరికి వచ్చి వెళ్తూ.. అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: సొంత ఊరికి వచ్చి వెళుతున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శరత్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం కుచ్చరకల్ గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి(70) కొంత కాలంగా కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం బాలకృష్ణారెడ్డి ద్విచక్రవాహనంపై కుచ్చరకల్‌కువచ్చి సాయంత్రం తిరిగి కర్మన్‌ఘాట్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో బైపాస్‌లోని అనూస్ జంక్షన్ వద్దకు రాగానే ఆయన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలకృష్ణారెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం వద్ద సీఈఓ రఘునందన్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ రఘునందన్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట సమీపంలోని సింగిల్ విండో కార్యాలయం గోదాంలో ఏర్పాటు చేసిన పభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ రఘునందన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధరను కల్పించడం జరుగుతుందని అన్నారు. అన్నదాతలు దళారులను నమ్మి తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడు రకం వరిధాన్యం క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యాలయం సిబ్బంది హరికృష్ణ, అన్వర్ పాల్గొన్నారు.

అడవి పందుల బెడదకు చర్యలు

సూచించిన ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సునీత


బైరంపల్లిలో రైతు సాగుచేసిన మొక్కజొన్న పంట

కొందుర్గు: కొద్దిపాటి మెళకువలు పాటిస్తే అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సునీత తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న, జొన్న, చెరుకు, వేరుశనగ, వరి తదితర పంటల్ని అడవిపందులు తీవ్రంగా నాశనం చేసి రైతులను నష్టాలకు గురిచేస్తున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ.. పందులకు వాసనను పసిగట్టే గుణం అధికంగా ఉంటుంది. అయితే పంది కొవ్వు, పేడ పంట పొలాల చుట్టూ ఉంచితే పందులు పంటలోకి రాకుండా నియంత్రించవచ్చు. పొలం చుట్టూ వెంట్రుకలు ఉంచితే, పందులు శ్వాస తీసుకునే సమయంలో ముక్కులోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అదేవిధంగా వాడేసిన చీరలు చుట్టూ కంచెలా ఏర్పాటుచేయాలి. హెచ్‌డీపీ నైలాన్ నెట్ మూడు అడుగుల ఎత్తువరకు పొలం చుట్టూ అమర్చాలి. అలాగే నేలపై పరవాలి. దీంతో పంది కాళ్ల గిట్టలకు తగిలి వెనక్కి పోతుంది. సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతోపాటు నార్మల్ సౌండ్స్ వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట పొలం చుట్టూ నాలుగైదు వరుసల ఆముధం, సజ్జ, కుసుమ పంటలను సాగుచేయాలి. పొలాల చుట్టూ కందకాలు తీయడం, సోలార్ ఫినిషింగ్ ఏర్పాటు చేయడంతో పందుల నుంచి పంటలను కాపాడుకోవచ్చని ఆమె సూచించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

- అడిగినందుకు తల్లిదండ్రులపై కత్తితో దాడి
- నెమలినగర్‌లో ఘటన
- ఇద్దరు నిందితుల అరెస్టు

మణికొండ: కిరాణ దుకాణానికి వెళ్లి ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించటంతో పాటు ఆమెపై ఓ యువకుడు బకెట్‌తో నీళ్ల పోసి వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. ఇదేమిటని అడిగినందుకు సదరు యువతి తండ్రి గొంతు కోసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్న అతడి భార్య చేతికి గాయామైంది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెమలినగర్‌లోని జీఎస్ఎన్ఆర్ఎంయు క్వార్టర్స్‌లో రాముడు కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సురేష్ అనే యువకుడు జులాయిగా తిరిగేవాడు. ఆదివారం మధ్యాహ్నం రాముడి కుమార్తె కిరాణా సరుకులు తెచ్చుకునేందుకు సమీపంలో ఉన్న అశోక్ కిరాణ షాప్‌కు వెళ్లింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన సురేష్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడమేగాక పక్కనే బకెట్‌లో ఉన్న నీటిని ఆమెపై పోశాడు. బాధితురాలు ఈ విషయాన్ని తల్లితండ్రులకు చెప్పడంతో ఆమె తండ్రి రాముడు కాలనీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లాడు. ఈ విషయమై మాట్లాడుతుండగా సురేష్‌తో పాటు అతని స్నేహితుడు ప్రవీణ్, మరికొందరితో కలిసి అక్కడికి వచ్చి మమ్మల్నే నిలదీస్తారా అంటూ కత్తితో రాముడిపై దాడికి దిగారు. అడ్డుకునేందుకు వెళ్లిన రాముడు భార్య చేతికి గాయమైంది. దీనిపై సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు ఇరు వర్గాలకు సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాముడు ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

రెక్కీ చేసి.. ఇల్లు లూటీ

- తీర్థయాత్రకు వెళ్లి వచ్చేసరికి చోరీ
- 5 తులాల బంగారం, 120 తులాల వెండి, రూ.3.50 లక్షల నగదు అపహరణ


దుండగులు తెరిచిన కబోర్డు

మొయినాబాద్: దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికే దుండగులు ఇళ్లంతా గుల్ల చేశారు. రెండుసార్లు రెక్కీ నిర్వహించి భారీ ఎత్తున నగలు, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాకారంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన రాయనోళ్ల ఉపేందర్ గత నెల 30న కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి దేవస్థానానికి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి దుండగులు ప్రహరీ గోడ దూకి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి 5 తులాల బంగారు, 120 తులాల వెండి ఆభరణాలు, రూ.3.50 లక్షల నగదు లూటీ చేశారు. ఇదంతా ఇంటికి ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఆదివారం రాత్రి ఉపేందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి, కబోర్డు తాళాలు పగలగొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు పరిశీలించారు. బంగారు, వెండి నగలు, నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ముందస్తు పథకం ప్రకారం

లూటీకి సంబంధించి దృశ్యాలన్నీ ఇంటికి అమర్చిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. అందులో రెండుసార్లు రెక్కీ చేశారు. దుండగులు మొదట సీసీ కెమెరాలు ఉన్నాయని గుర్తించారు. ఈ క్రమంలో హార్డ్‌డిస్క్ తస్కరిద్దామని ఇంటర్‌నెట్ బాక్స్‌ను తీసుకెళ్లారు. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

విద్యార్థుల ఉపాధి కల్పనకు కృషి

- జేబీ గ్రూప్ విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణారావు
- 27 కంపెనీల సీఈఓలతో ఉద్యోగ ఒప్పందాలు


ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న కృష్ణారావు, సీఈఓలు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఇంకుబేషన్ యాక్సిలరేషన్ సమావేశం జేబీ గ్రూప్ విద్యా సంస్థల్లో నిర్వహించడం సంతోషకరమని ఆ సంస్థల కార్యదర్శి జే.వి.కృష్ణారావు అన్నారు. మండలంలోని అమ్మాపూర్ చౌరస్తాలో జేబీ విద్యా సంస్థల్లో సోమవారం టీ–హబ్ సహకారంతో తెలంగాణ రాష్ట్ర ఇంకుబేషన్ యాక్సిలరేషన్ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 27 కంపెనీల సీఈఓలతో పాటు ఇంకుబేషన్ సంస్థ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల కార్యదర్శి కృష్ణారావుతో ఒప్పందం నిర్వహించి సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధి దిశలో భాగంగా వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని సూచించారు. కార్యక్రమంలో జేబీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమాచారి, డాక్టర్ సృజన, ఆయా కళాశాలల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాజలం.. వృథాపర్వం

యాచారం: ప్రస్తుతం మండుతున్న ఎండలకు జల వనరులన్నీ ఆవిరవుతున్నాయి. ఈ దశలో నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం అధికార యంత్రాంగంపై ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే కృష్ణాజలాల పైపులకు లీకేజీలు ఏర్పడ్డాయి. మండలంలోని సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద కృష్ణాజలాల పైపుల నుంచి తాగునీరంతా వృథాగా పోతోంది. నాగార్జునసాగర్ నుంచి ప్రత్యేక పైపుల ద్వారా నగరంతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలకు కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నారు. అధికారులు పైపులకు మరమ్మతులు చేసి వేసవిలో నీటి ఎద్దడి నుంచి ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద పైపులకు ఏర్పడ్డ లీకేజీలు